


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

శుక్రవారం, 31 జనవరి 2025

5



'కబ్జాకు కాదేదీ అనర్హం' అన్నట్టుగా తయారైంది ఖమ్మం నగరంలో భూ అక్రమణల పరిస్థితి.. తప్పుడు పత్రాలతో కొందరు, అసలు పత్రాలే లేకుండానే మరికొందరు, దొంగపత్రాలు సృష్టించి ఇంకొందరు.. ఇలా ఎవరు పడితే వారు.. ఎక్కడైనా చిన్నపాటి ప్రభుత్వ స్థలం కనిపించినా కబళిస్తున్నారు. తాజాగా ఖమ్మం నగరం నడిబొడ్డున కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఓ మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సమీపంలో కొందరు కేటుగాళ్లు రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో 58, 59 జీవోల్లో అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వచ్చిన సందర్భంలో ప్రభుత్వ భూములను గుర్తించి ఫెన్సింగ్ వేసినా.. ఎన్నెస్పీ ప్రాంతంలో మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం గమనార్హం.



ఈ ఇంటి ఫొటోతో రెండు వేర్వేరు అసెస్‌మెంట్లు

ప్రభుత్వ భూమి పరులపాలు

- దొంగ అసెస్‌మెంట్లతో దర్జాగా రిజిస్ట్రేషన్లు
- పక్క సర్వే నెంబర్లతోనూ చెరబడుతున్న వైనం
- రూ.కోట్ల విలువైన భూమిని కాజేస్తున్న కేటుగాళ్లు
- నగరంలోని ఎన్నెస్పీ ప్రాంతంలో జోరుగా కబ్జా పర్వం
- అధికారుల తీరుపై అనుమానాలెన్నో?

ఖమ్మం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కాసుల కక్కుర్తితో వందలకొద్దీ దొంగ అసెస్‌మెంట్లు వేసి వాటిని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను కాజేస్తున్న ఉదంతాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. సరిగ్గా ఏడాది క్రితం ఖమ్మం త్రీటౌన్‌లోని ప్రభుత్వ భూమికి అసెస్‌మెంట్లు వేసిన విషయం వెలుగులోకి రావడంతో పలువురిపై కేసులు నమోదు చేసిన విషయం విధితమే.. అయితే గతంలో కేవలం ప్రభుత్వ భూమికి అసెస్‌మెంట్లు వేయడం వరకు మాత్రమే పరిమితం కాగా.. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన ఘటనలో ఏకంగా రిజిస్ట్రేషన్లే జరిగిపోయాయి. అది కూడా ఎలాంటి సర్వే నెంబరు లేకుండానే చేయడం గమనార్హం. కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని ఓ పేరుపొందిన పాఠశాల, చర్చికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమికి ఒకే ఇంటి ఫొటోతో రెండు అసెస్‌మెంట్లు వేయించారు. అంతేకాకుండా ఆయా అసెస్‌మెంట్లు ఉన్న ఒక ఇంటి నెంబరుతో ఏకంగా 305 గజాల స్థలాన్ని 2021లో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసి లింకు డాక్యుమెంట్లు సృష్టించడంతోపాటు ఆ లింకు డాక్యుమెంట్ల ఆధారంగా 2023లో మరొకరి పేరుమీద భూమిని విక్రయించడం కొసమెరుపు. వాస్తవానికి అసలు సంబంధిత స్థలంలో ఎలాంటి నిర్మాణం లేకపోవడంతో పాటు, సంబంధిత విక్రయ డాక్యుమెంట్లలో ఎక్కడ కూడా సర్వే నెంబరు ప్రస్తావించలేదు. కేవలం హద్దులు మాత్రమే ఉన్న ఇంటి నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ ఎలా చేశారన్న అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అలా రెండు అసెస్‌మెంట్లలో కలిపి అక్కడ సుమారు 600 గజాల స్థలం కబ్జా కోరల్లోకి వెళ్లిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పక్క సర్వే నెంబర్లతో చెరబట్టిన మరికొందరు

దానికి పక్కన ఉన్న మరొకరు ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 98 పేరుతో డాక్యుమెంట్లు ఉండగా.. సర్వే నెం. 90లో సుమారు రూ.6కోట్ల విలువైన 600 గజాల ప్రభుత్వ స్థలంలో ఏకంగా పెద్ద భవంతే నిర్మించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అసలు 98 సర్వే నెంబరులోని లింకు డాక్యుమెంట్లను పరిశీలిస్తే ఆయా డాక్యుమెంట్లకు మొదటి డాక్యుమెంట్‌కు, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంటుకు సంబంధం లేకపోవడం శోచనీయం. సదరు డాక్యుమెంట్ ప్రకారం ప్రస్తుతం సర్వే (మిగతా 6వ పేజీలో)

అధికారుల తీరుపై అనుమానాలెన్నో..

ఎన్నెస్పీ ప్రాంతంలోని ప్రభుత్వ భూములన్నీ ఇతర శాఖలకు, భవనాలకు కేటాయించినవే ఉన్నాయి. ఆయా ప్రాంతంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా.. మిగిలిన ప్రాంతాలను సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోని కారణంగానే ఆక్రమణలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా అసలు ఆయా ఆక్రమణల వెనుక పలు శాఖల అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. ఫలితంగానే తమ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న స్థలానికి కార్పొరేషన్ అధికారులు అసెస్‌మెంట్లు వేసి అక్రమార్కులకు అప్పజెప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు అసెస్‌మెంట్లు మాత్రమే వేసినా సదరు ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఏకంగా రిజిస్ట్రేషన్ చేసి సర్వ హక్కులు కల్పించే ప్రయత్నాలు చేయడం గమనార్హం. ఇదంతా పక్కనపెడితే గతంలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలనే లక్ష్యంతో కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూములకు అధికారులు ఫెన్సింగ్ వేశారు. కానీ కార్పొరేషన్ వెనుక ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు మాత్రం ఎందుకు ఫెన్సింగ్ వేయలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గతంలో ఎన్నెస్పీ క్వార్టర్స్ ఉన్న ప్రాతంతో పాటు, దాని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- జిల్లా పర్యాటక రంగాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక లోగో
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పర్యాటక ప్రాంతాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి నేలకొండపల్లి బౌద్ధస్థూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా, పులిగుండాల ప్రాజెక్ట్, వెలుగుమట్ల అర్బన్‌పార్క్ వంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలతో పాటు ఎకో టూరిజంపై సమీక్షించారు. జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల వద్ద తలపెట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుత స్థితిగతులను వివరిస్తూ జిల్లా అటవీ అధికారి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకంగా జిల్లా అభివృద్ధికి, ప్రత్యేకంగా జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ వద్ద 40 అడుగుల రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగుమట్ల అర్బన్‌పార్క్‌ను ప్లాస్టిక్ రహితం చేయాలన్నారు. ఖమ్మం జిల్లా పర్యాటక ప్రాంతాలు, ఎకో టూరిజానికి బ్రాండింగ్ వచ్చేలా నూతన లోగో, ట్యాగ్‌లైన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అటవీపార్క్, కాటేజీ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాలేరు లేక్ వద్ద పిక్నిక్ స్పాట్ అభివృద్ధి చేయాలన్నారు. ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మాణ పనులపై ప్రజలతో చర్చించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రోప్‌వేకు 500 మీటర్ల దూరంలో పార్కింగ్ ఏరియాను గుర్తించాలని సూచించారు. ఖమ్మం ఖిల్లా వద్ద పురావస్తు శాఖ సమన్వయంతో ముందుగా అవసరమైన మరమ్మతులు చేపట్టి పర్యాటకులను ఆకర్షించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీఆర్డీవో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, టూరిజం జిల్లా అధికారి సుమన్ చక్రవర్తి, నీటిపారుదల, దేవాదాయ, అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఐటీసీ కార్మిక సంఘం ఎన్నికలు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు

బూర్గంపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో గురువారం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 16 కార్మిక సంఘాలు ఉండగా కేవలం ఐదు కార్మిక సంఘాలు మాత్రమే ఈ ఎన్నికల బరిలో నిలిచాయి. ఇప్పటికే ప్రచారం పూర్తి చేసుకున్న యూనియన్ల నాయకులు కార్మికులను ఎలాగైనా మచ్చిక చేసుకొని తమకు ఓటు వేసేలా పావులు కదుపుతూ ముందుకు సాగుతున్నారు. కేవలం 1,253 ఓట్లే ఉన్నా సాధారణ ఎన్నికలను మరిపించేలా ఐటీసీ గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనంతరం కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. ఎన్నికలకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటిస్తూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

హామీలు మరిచిన కాంగ్రెస్ పాలకులు



ఖమ్మంలో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

- రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నిరసనలు
- ఇరు జిల్లాల్లో మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతులు

ఖమ్మం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిపోయిందని పలువురు బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాల వద్ద నివాళులు అర్పించి రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణతో పాటు మరికొందరు నేతలు నిరసన తెలిపారు. మధిరలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు నాయకులు కలిసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. సత్తుపల్లి పట్టణంలో బాపూజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వేంసూరు మండలం మర్లపాడు, తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్, పెనుబల్లి మండలం వీఎంబంజర్, కల్లూరులో గాంధీ విగ్రహాలకు వినతిపత్రం అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులోని గాంధీచౌక్ వద్ద గాంధీ విగ్రహానికి కొత్తగూడెం మునిసిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అశ్వారావుపేట, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. దమ్మపేట మండలంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియ, మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు పూర్తవుతోందని, ఆ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు కూడా 420వంటివి కావడం వల్ల ఇంకా నెరవేర్చడం లేదన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో విప్లవాత్మకమైన పథకాలు తీసుకొచ్చారన్నారు.



ఎర్రుపాలెం ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ సెక్రటరీలు


మావల్ల కాదు మన్నించండి

- ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక నుంచి మినహాయించండి
- ఎర్రుపాలెం మండల పంచాయతీ సెక్రటరీల వేడుకోలు

ఎర్రుపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల అర్హులను ఎంపిక చేసే ప్రక్రియ నుంచి తమను మినహాయించాలని ఎర్రుపాలెం మండలంలోని పంచాయతీ సెక్రటరీలు కోరుతున్నారు. ఈ మేరకు 31 పంచాయతీలకు చెందిన సెక్రటరీలు గురువారం ఎంపీడీవో సురేందర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామాల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న పనులకే తమతమవుతున్న తరుణంలో తమపై అదనపు పని భారాన్ని మోపవద్దని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమాల్లో అన్ని సంక్షేమ పథకాలు ఒక ఎత్తయితే ఇందిరమ్మ ఇళ్ల అర్హులను ఎంపిక చేయడం ఒక ఎత్తని తెలిపారు. క్షేత్రస్థాయిలో అనేక రాజకీయ ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఇప్పటికే ఇతర శాఖల విధులు, పనులు, సర్వేలతో తమపై పనిభారం పెరగడంతో తీవ్ర ఒత్తిడితో మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

అరుదైన భాగ్యం

- మూడు తరాలతో.. నాలుగు దశాబ్దాలుగా...
- 40 ముక్కోటిలు, 39 శ్రీరామ నవమి వేడుకల్లో..
- రామయ్య సన్నిధిలో వేద పండితుడిగా సేవలు
- నేడు ఉద్యోగ విరమణ చేయనున్న చిట్టి హనుమత్‌శాస్త్రి



భద్రాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్య సన్నిధిలో మూడు తరాలకు చెందిన అర్చకులతో నాలుగు దశాబ్దాల పాటు పని చేసే అరుదైన భాగ్యం ఆయనకు దక్కింది. కృష్ణ యజుర్వేద పండితులు, భద్రాద్రి దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న చిట్టి హనుమత్‌శాస్త్రి శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. భద్రాద్రి దేవస్థానంలో 1985 డిసెంబరు 13న కృష్ణ యజుర్వేద పండితుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన నాలుగు దశాబ్దాల పాటు వేద పండితుడిగా కొనసాగారు.

ఈ క్రమంలో 40 ముక్కోటిలు, 39 శ్రీరామ నవముల్లో పాల్గొన్నారు. అదేవిధంగా మూడు పుష్కరాల్లో ఆయన పాల్గొన్నారు. అలాగే 1987లో నిర్వహించిన మహాసామ్రాజ్య పట్టాభిషేకంలో సైతం వేద పండితుడిగా బాధ్యతలు నిర్వహించారు. భద్రాచలంలో భక్తరామదాసు తీసుకొచ్చిన ఐదు గోత్రాలకు చెందిన అర్చక కుటుంబాలలో మూడు తరాలకు చెందిన అర్చకులతో ఆయనకు అనుబంధం ఉండటం విశేషం. ఇదిలా ఉండగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పుట్టపర్తి సత్యసాయిబాబా 80వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆనాడు అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్ సుందర్‌కుమార్ ఉమ్మడి రాష్ట్రంలోని దేవాదాయ శాఖకు చెందిన ఇరువురు వేద పండితులను వేద ఆశీర్వచనంకోసం ఎంపిక చేయగా.. అందులో చిట్టి హనుమత్‌శాస్త్రి ఒకరు. ఆయన ఆ సమయంలో వెళ్లి ఆ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. రామయ్య సన్నిధిలో నాలుగు దశాబ్దాల పాటు పని చేయడం తన మహద్భాగ్యమని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కలెక్టరు జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం సైతం అందుకున్నారు.

పామాయిల్ సాగు లాభదాయకం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే పలు రాయితీలపై అవగాహన
- అంతర పంటలతో అధిక దిగుబడులు
- పామాయిల్ సాగుపై దూరదర్శన్ కిసాన్ మంచ్ సీజన్ కార్యక్రమం ఏర్పాటు

దమ్మపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ సరోజినిదేవి అన్నారు. అల్లిపల్లి గ్రామంలో పామాయిల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ వ్యవసాయక్షేత్రంలో పామాయిల్ సాగు, అంతరపంటలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందజేస్తున్న రాయితీలపై ఉద్యాన శాఖ, దూరదర్శన్ కిసాన్ ప్రశ్న మంచ్ సీజన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో పామాయిల్ సాగు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో జేడీ సరోజినిదేవి మాట్లాడుతూ దేశంలో అవసరాలకు సరిపడా పామాయిల్ ఉత్పత్తి లేకపోవటంతో ఇతర దేశాలనుంచి వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. రైతులు పామాయిల్ పంట సాగు చేయటం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రస్తుతం టన్ను పామాయిల్ గెలల ధర రూ.20వేలకు పైగా ఉందన్నారు. పామాయిల్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అధికంగా రాయితీలు ఇస్తోందన్నారు. మొక్కలు, ఎరువులు, డ్రిప్, రాయతీలపై అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యానవన శాస్త్రవేత్త రాంచంద్రుడు మాట్లాడుతూ పామాయిల్ సాగు చేయటంతో పాటు దీర్ఘకాలిక, స్వల్పకాలిక అంతర పంటలు సాగు చేయటం ద్వారా అదనపు ఆదాయంతోపాటు పామాయిల్ సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పామాయిల్ మొక్క నాటిన దగ్గరి నుంచి మూడేళ్ల అంతరపంటలుగా వరి పంట తప్ప అన్నిరకాల పంటలు సాగు చేయవచ్చన్నారు. ఎనిమిదేళ్లు దాటిన పామాయిల్ తోటల్లో దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చే కోకో, పిప్పళ్ళు వంటి పంటల సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. వీటిని సాగు చేయటం ద్వారా అదనపు ఆదాయంతో పాటు వాటి నుంచి వచ్చే వ్యర్థాలతో హెక్టారుకు 10టన్నుల సేంద్రియ ఎరువు వస్తుందన్నారు. రైతులు ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా వాటి ద్వారా వచ్చిన వ్యర్థాలనే ఎరువుగా చేసుకొని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పామాయిల్ పంటలో కోకో దిగుబడి రాదని అపోహలు మానుకోవాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగులో వచ్చే తెగుళ్ల వాటికి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్త సుబ్బన్న రైతులకు వివరించారు. పామాయిల్ అధికంగా సాగు చేస్తున్న రాష్ట్రాలలో రైతుల అభిప్రాయాలు సేకరించి వివిధ రాష్ట్రాల్లో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన నిర్వహించేందుకు ఉద్యానవన, దూరదర్శన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, ఆయిల్‌ఫెడ్ అధికారులు బాలకృష్ణ, రాధాకృష్ణ, ఉద్యాన శాఖాధికారులు కిషోర్, సందీప్, సిబ్బంది, రైతులు దొడ్డా ప్రసాద్, బండి భాస్కర్, కందిమళ్ల కృష్ణారావు, కేవీ సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, మంగేశ్వరరావు, వసంతరావు, శ్రీరాములు ప్రసాద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ సరోజినిదేవి

సమస్యల పరిష్కారమే టీఎన్జీవో లక్ష్యం..

జిల్లా టీఎన్జీవో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో వక్తలు...



టీఎన్జీవో డైరీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తగూడెం అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యల పరిష్కారమే టీఎన్జీవో సంఘం లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, గెజిటెడ్, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లో భద్రాద్రి జిల్లా టీఎన్జీవో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటానికి టీఎన్జీవో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. భద్రాద్రి జిల్లాగా రూపాంతరం చెందినప్పటికీ ఇరిగేషన్ శాఖలో అలవెన్స్‌లు నిలిపివేశారని, తక్షణం పునరుద్ధరణ చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను డీపీసీ ద్వారా పదోన్నతి కల్పించాలన్నారు. తొలుత టీఎన్జీవో సంఘం నూతన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరనేని రామారావు, సాయి భార్గవ చైతన్య, రాష్ట్ర సహ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, భద్రాద్రి జిల్లా టీజీవో అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకటపుల్లయ్య, మహేష్, టీఆర్‌టీఎస్‌ఏ జిల్లా కార్యదర్శి డి. పుల్లయ్య, ఏంపీవో సంఘం రాష్ట్రఅధ్యక్షుడు శేషాంజన్, ఖమ్మం జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, ఖమ్మం జిల్లా టీజీవో అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, వేల్పాద్రి, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాషా, పాల్గొన్నారు.

గిరిజన విద్యా సంస్థల్లో వర్కర్లకు తక్షణమే వేతనాలు చెల్లించాలి

- పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరుకు నోడ్యూ సర్టిఫికెట్లు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్



వీడియో కాన్ఫరెన్స్‌లో పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో పని చేసే డైలీ వేజ్ వర్కర్లు, ఏఎన్ఎం, పీఎంహెచ్, సీఆర్టీల వేతనాలకు సంబంధించి బడ్జెట్ రిలీజ్ చేసినందున వారికి సంబంధించిన బిల్లులు వెంటనే మంజూరు చేసి వేతనాలు అందేలా చూడాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా గిరిజన సంక్షేమ శాఖ డీడీ, డీటీడీవోలతో ఆయన మాట్లాడారు. పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి పూర్తిస్థాయి డేటా తెప్పించుకోవాలని ఆదేశించారు. వచ్చే నెలలో జరిగే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహణ కోసం సంబంధిత జిల్లా కలెక్టరుకు నిధులు విడుదల చేయడం జరుగుతుందని, నియోజకవర్గ ఎమ్మెల్యే సూచించిన ప్రాంతంలో జయంతి వేడుకలు నిర్వహించాలన్నారు.అలాగే పోడు పట్టాలు అందించి గిరిజన రైతులకు సబ్‌స్టేషన్ దగ్గరగా ఉన్న రైతులను గుర్తించి వాటికి సంబంధించిన వివరాలు త్వరితగతిన పంపాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాహుల్, డీడీ మణెమ్మ, ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, జీసీసీ డీఎం సమ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

భద్రాచలం ఐటీడీఏలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు పీవో బి.రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ భారతమాత విముక్తి కోసం జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో మహనీయులు ప్రాణాలు త్యాగం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ చంద్రశేఖర్, ఎస్వో భాస్కర్ పాల్గొన్నారు.

రేపు శివాలయంలో వేలం పాట

కల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని కల్లూరులోని శ్రీకాశ్మీర మహాదేవ క్షేత్రం (శివాలయంలో) శనివారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో దుకాణాల సముదాయాలపై నిబంధనలకు లోబడి వేలం పాట నిర్వహించటం జరుగుతుందన్నారు. లడ్డూప్రసాదం, మిఠాయి షాపు, కొబ్బరికాయల పాట, కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొనే హక్కు, దుకాణముల ఏర్పాటుపై వేల పాట నిర్వహించటం జరగుతుందని వివరించారు.

మహాశివరాత్రి జాతర ఫిబ్రవరి నెల 25 నుంచి 27వ తేదీ వరకు పైవిధంగా దుకాణాల అనుమతికి వేలపాట నిర్వహించనుండగా పాటలో పాల్గొనదలిచిన వారు తగిన ధరావత్తు చెల్లించి పాల్గొనాలని అర్హులని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

టీజేఎస్ ప్లీనరీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గోపగాని శంకర్‌రావు

ఏన్కూరు, జనవరి30(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 2న ఖమ్మం అంబేద్కర్ భవన్‌లో జరిగే తెలంగాణ జనసమితి 3వ జిల్లా ప్లీనరీని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు పేర్కొన్నారు. ఏన్కూరులో గురువారం ప్లీనరీని జయప్రదం చేయాలని కోరుతూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లీనరీకి కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్లీనరీకి మేధావులు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం పోరాడుతున్న కోదండరామ్‌కు అండగా నిలవాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమానికి టీజేఎస్ విశేష కృషి చేస్తోందన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 250 గజాల ఇంటిస్థలం, నిర్మాణానికి రూ.10లక్షలు, రూ.25వేల పింఛన్ అమలుకు ప్రభుత్వంపై వత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల కోసం నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వరదబోయిన బాబు, మండల నాయకులు ఎల్.నరసింహారావు, వినోద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోయని పథకం..ఏళ్లుగా నిరుపయోగం

చెంతనే నీరున్నా ప్రయోజనం శూన్యం

ఆందోళనలో మధిర మండల రైతులు

మధిర రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఇల్లెందులపాడు సమీపంలో వైరా నది ఒడ్డునగల దెందుకూరు, ఇల్లెందులపాడు ఎత్తిపోతల పథకం పలు సమస్యలతో కునారిల్లుతూ అనేక ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. పథకం పూర్తిగా మూలన పడింది. చెంతనే పుష్కలంగా ఏట్లో నీరు ప్రవహిస్తున్నప్పటికీ ఈ పథకం మూలనపడటంతో రైతుల పంటపొలాలకు నీరందించలేకపోతుంది. దీంతో నీరున్నా వరి, ఇతర వాణిజ్య పంటలు వేసుకునే అవకాశం లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో సుబాబుల్ పంటలు సాగుచేసుకుంటున్నారు.



నీటి వసతి లేక సుబాబ్‌లు పంట వేసిన రైతులు

ఆది నుంచి అంతంతమాత్రంగానే..

2002వ సంవత్సరంలో ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి మధిర ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.మూడుకోట్ల నిధులు మంజూరు చేశారు. 1300ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా ఈ పథకాన్ని నిర్మించారు. అయితే ప్రారంభంలో రెండు, మూడు సంవత్సరాలపాటు సక్రమంగానే పనిచేసింది. ఆ తర్వాత నుంచి దెందుకూరు, ఇల్లెందులపాడు గ్రామాల రైతుల మధ్య సరైన సమన్వయం లేకపోవడం, పటిష్టమైన కమిటీ లేకపోవడంతో తరచూ లిఫ్టు నడవటానికి అవాంతరాలు ఎదురయ్యాయి. లిఫ్టు కాల్వలను దెందుకూరుకు చెందిన కొంతమంది రైతులు కూడా పూడ్చివేశారు. ఇల్లెందులపాడు ఏటికి వెళ్లే డొంక రోడ్డు నుంచి ఈ పథకం వద్దకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం కూడా లేదు. దీంతో కోట్లరూపాయలతో ఈ పథకం నిర్మించినప్పటికీ ఏనాడూ కూడా పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించిన పాపాన పోలేదు.

ఐదారేళ్ల నుంచి పూర్తిగా నిరుపయోగం..

గత ఐదారు సంవత్సరాల నుంచి ఈ లిఫ్టు పూర్తిగా మూలనపడింది. పైపులు తుప్పుపట్టిపోయాయి. 20హెచ్‌పీ రెండు మోటర్లు, 30హెచ్‌పీ రెండు మోటర్లు పాడైపోయాయి. లిఫ్టు బిల్డింగ్ చుట్టూ ముళ్లకంచెలు బాగా పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. మధిర సమీపంలోని ఇల్లెందులపాడు వద్ద వైరా నది సంవత్సరంలో పదినెలలపాటు పొంగి ప్రవహిస్తూ ఉంటుంది. ఏటిపైభాగంలో చెక్‌డ్యాంల నిర్మాణం కూడా చేపట్టడంతో ఈ లిఫ్టు సమీపంలో ఏటిలో పెద్ద ఎత్తున నీరు కూడా నిల్వ ఉంటుంది. పుష్కలంగా నీరున్నప్పటికీ పథకం మూలనపడటంతో రైతుల పంటపొలాలకు నీరందడం లేదు. ఈ పథకం ఆయకట్టులోని 80శాతం మంది రైతులు నీటి సౌకర్యం లేక సుబాబుల్ వంటి పంటలను సాగుచేశారు. రెండు గ్రామాల రైతులు పలుమార్లు అధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ ఎత్తిపోతల పథకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన దెందుకూరు ఎత్తిపోతల పథకం

లిఫ్టును వినియోగంలోకి తేవాలి

వినయ్, యువరైతు, ఇల్లెందులపాడు



ఇల్లెందులపాడులో ఎత్తిపోతల పథకం పనిచేయకపోవడంతో పంటపొలాలకు నీరందడం లేదు. దీంతో సాగుచేసే రైతులం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మూతపడిన ఈ లిఫ్టుకు నిధులు మంజూరు చేసి పునర్నిర్మిస్తే రైతుల పంటపొలాలకు పుష్కలంగా నీరందుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలి.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

వూట్ల రాంబాబు, రైతు, దెందుకూరు



మూతపడిన లిఫ్టు గురించి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. గతంలో ఒకసారి వచ్చి పరిశీలించారు. ఏట్లో నీళ్లున్నప్పటికీ లిఫ్టు పనిచేయకపోవడంతో సుబాబుల్ వంటి పంటలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పంటలు సరిగా పండక ఇబ్బందులు పడుతున్నాము.

ప్రభుత్వ భూమి పరులపాలు

(5వ పేజీ తరువాయి)

నెంబరు-98లో గతంలో మూడు లింకు డాక్యుమెంట్లు ఉన్నట్లుగా చూపించగా.. వాటిల్లో 1988నుంచి ఉన్న లింకు డాక్యుమెంటు మాత్రం చింతకాని మండలం పొద్దుటూరులో సర్వే నెంబరు 190లోని భూమిగా ఉన్నాయి. ఆ తర్వాత నుంచి కొనసాగిన లింకు డాక్యుమెంట్లు మాత్రం ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురం రెవెన్యూలోని 98 సర్వే నెంబరుకు ఎలా మారిందన్నది ప్రశ్నార్థకం. ఇలాంటి ఆక్రమణలు ఆ ప్రాంతంలో కుప్పలు తెప్పలుగా ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. మరికొందరైతే పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కలుపుకుని దర్జాగా ఇంటి నిర్మాణాలు చేసుకున్నారన్న విమర్శలున్నాయి.



సర్వే నెంబరు లేకుండా ఇంటి నెంబరుతో రిజిస్ట్రేషన్

నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలు ఇలా..

ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయానికి, నూతన బస్టాండ్‌కు సమీపంలో ఉన్న పలు సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి, ప్రభుత్వ శాఖలకు చెందిన భూములున్నాయి. వాటిల్లో సర్వే నెం.87లో 1.19ఎకరాలు, 89లో 0.28, 90లో 4.16, 91లో 2.20, 92లో 9.19, 93లో 18.36, 94లో 6.33, 95లో 0.20, 96లో 7.30, 97లో 0.34, 98లో 14.07 ఎకరాలు ప్రభుత్వ సంస్థలకు చెందిన భూములు ఉన్నట్లుగా చూపిస్తూ వాటిని రిజిస్ట్రేషన్ల నిషేధిత జాబితాలో పొందుపరిచారు. ఆయా సర్వే నెంబర్లలో ఉన్న మొత్తం భూమి సైతం నిషేధిత జాబితాల్లో ఉన్నా.. కొన్ని సర్వే నెంబర్లలో అక్రమంగా భారీగానే రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శిథిల కల్వర్టుపై భారీ వాహనాలు



ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్న వాహనాలు

దుమ్ముగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తూరుబాక వద్ద ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై శిథిలమైన కల్వర్టుపై కొద్ది రోజులుగా భారీ వాహనాలు ప్రయాణిస్తున్నాయి. గతేడాది సెప్టెంబరులో కల్వర్టు కుంగడంతో ప్రత్యామ్నాయంగా పక్కనే మరో రహదారిని ఏర్పాటు చేశారు. తేలికపాటి వాహనాల రాకపోకలకు మాత్రమే అవకాశం ఉండేలా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రమాదకర కల్వర్టు ప్రాంత రహదారికిరు వైపులా మట్టికట్టలు పోయడంతోపాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఒకట్రెండు నెలల పాటు ఆ దారిలో భారీ వాహనాలు తిరగలేదు. ఇటీవల కాలంలో లోడు లారీలు, ప్రైవేటు బస్సులు, కుంగిన కల్వర్టు రహదారి గుండా ప్రమాదక పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై బయటప్రాంతానికి చెందిన వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. రాత్రివేళలో వాహనదారులకు కుంగిన కల్వర్టు కనబడని పక్షంలో పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టిసారించి ప్రమాదకర ప్రాంతంలో భారీ వాహనాల రాకపోకలను కట్టుదిట్టం చేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. శిథిలమైన కల్వర్టుపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

వన్య ప్రాణులకు హాని కల్గించొద్దు: ఎఫ్‌డీవో

కరకగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అటవిలోని వన్య ప్రాణులకు ఎవరైన హాని కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మణుగూరు డివిజన్ ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మొహిద్దీన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని కలవలనాగారం అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి విద్యుత్ స్తంభం నుంచి విద్యుత్ తీగలను వన్య ప్రాణుల కోసం ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అటవీశాఖ అధికారులు ఆ వ్యక్తిని పట్టుకున్నారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ.. వన్య ప్రాణులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వన్య ప్రాణులకు హాని కల్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణులకు సంరక్షణకు ప్రతీ ఒక్కరూ చర్యలు తీసుకోవాలని, ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో ఆసుపత్రికి ఆంబోతు

- రెండు రోజులుగా ఆసుపత్రి వద్దే నిరీక్షణ
- పశువైద్యులకు 108 సిబ్బంది సమాచారం
- ప్రథమ చికిత్స చేసిన పశు వైద్యులు
- పెనుబల్లి ఏరియా ఆసుపత్రి వద్ద ఘటన

సత్తుపల్లి/పెనుబల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కారాయిగూడెం గ్రామస్థులు సంరక్షిస్తున్న ఆంబోతు అనారోగ్యం బారిన పడి తనంతట తానే మండల కేంద్రమైన పెనుబల్లి ఏరియా ఆసుపత్రికి చేరుకుంది. దానికి పశు వైద్యశాఖ సిబ్బంది గురువారం ప్రథమ చికిత్స చేశారు. కారాయిగూడెంలో గ్రామస్థులు రెండు ఆంబోతులను పెంచుతున్నారు. వీటిలో 14ఏళ్ల వయస్సున్న ఒక ఆంబోతు బుధవారం ఆ గ్రామానికి 10కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుబల్లి ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఆవరణలో పడుకుంది. ఆసుపత్రికి వచ్చివెళ్లేవారు దానికి ఆహారం అందించారు. అయితే బుధవారం నుంచి కదలకుండా పడుకుని ఉన్న ఆంబోతును 108సిబ్బంది గమనించి పశు వైద్యులకు సమాచారం అందించారు. దాంతో గురువారం ఉదయం పశువైద్యులు డాక్టర్ సృజన, పి. సురేష్, ఆఫీస్ సబార్డినేట్ జమీల్ వచ్చి ఆంబోతును పరీక్షించి అనారోగ్యంతో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం దానికి ప్రథమ చికిత్స చేసి ఇంజక్షన్లు వేసి సెలైన్ ఎక్కించారు. గురువారం మధ్యాహ్నానికి ఆంబోతు కోలుకోగా కారాయిగూడెం గ్రామస్థులు ఆసుపత్రి వద్దకు వచ్చి దానిని ప్రత్యేక వాహనంలో గ్రామానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, రోడ్లవెంట చెత్తాచెదారం తినడం వల్ల ఆంబోతుకు గ్యాస్టిక్ సమస్య వచ్చి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఆంబోతు ఆరోగ్యం నిలకడగా ఉందని ఆమె తెలిపారు.



ఆంబోతుకు ఆహారం అందిస్తున్న దృశ్యం

యూజీసీ ముసాయిదా నిబంధనలను.. రద్దు చేయాలి

జూలూరుపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే యూజీసీ ముసాయిదా నిబంధనలను తక్షణమే రద్దు చేయాలని, వైస్ చాన్సలర్ల నియామకాన్ని గవర్నర్లకు అప్పగించే నిర్ణయాన్ని కేంద్రం ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యను మరింత కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, కాషాయికరణ చేసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. విద్య కాషాయీకరణకు బీజేపీ ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోందని ఆరోపించారు. ఈ విధానాన్ని ప్రతీ ఒక్కరూ నిరసించాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు అనిల్, శ్రీనివాస్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ ఉద్యోగులకు శుభవార్త

రెండు రోజులు ముందుగానే అవుట్ సోర్సింగ్ వేతనాలు

29కే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జనవరి వేతనాలు

ప్రత్యేక చొరవ చూపిన కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ ఉద్యోగుల వేతనాల సమస్యకు తెరపడటంతో పాటుగా ప్రభుత్వ రెగ్యూలర్ ఉద్యోగుల కంటే రెండు రోజులు ముందుగానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలు బ్యాంకు ఖాతాలకు జమ కావటంతో ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగులకు పండుగ వాతావరణం ఏర్పడింది. ఖమ్మం నగర పాలక సంస్థలో 984 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, 17 మంది డీఆర్ఎఫ్ సిబ్బందికి కేఎంసీ నుంచి ప్రతి నెలా వేతనాలు పంపిణీ జరుగుతుంది. అయితే డిసెంబర్‌లో మాత్రం ఖజానా శాఖ నుంచి వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావటంతో కేఎంసీ నుంచి చెల్లింపులు జరగలేదు. ఖజానా శాఖ నుంచి చెల్లింపులకు సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. దీంతో క్రిస్మస్, సంక్రాంతికి కూడా కేఎంసీ ఉద్యోగులు వేతనాలు తీసుకోలేదు.

చొరవ చూపిన కమిషనర్

అవుట్ సోర్స్ ఉద్యోగుల వేతనాలు పెండింగ్‌లో పడటంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య పలు మార్లు సీఎఫ్ఎంఎస్ అధికారులతో మాట్లాడారు. ఖజానా నుంచి ఏర్పడిన సాంకేతిక ఇబ్బందులను తొలగించారు. డిసెంబర్ వేతనాలకు లైన్ క్లియర్ చేశారు. అలాగే జనవరి మాసం వేతనాలను కూడా 26వ తేది వరకు పారిశుధ్య కార్మికుల వేతనాల ఫైల్స్ తెప్పించి వాటిని ఖజానాకు పంపి, ప్రత్యేకంగా చొరవ తీసుకోవటంతో జనవరి 29న జనవరి మాసం వేతనాలు అవుట్ సోర్స్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు చేరాయి. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. రెగ్యూలర్ ఉద్యోగుల కంటే రెండు రోజులు ముందుగానే తమకు వేతనాలు వచ్చాయని కేఎంసీ పాలకవర్గానికి, కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం

ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు


అవార్డులు పొందిన డ్రైవర్లతో అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 30:(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమం నగరంలోని నూతన బస్టాండ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఖమ్మం రవాణాశాఖ అధికారి వెంకటరమణ, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, రీజనల్ మేనేజర్ సరిరాం హాజరై మాట్లాడారు. ప్రమాదాలలో అతి తక్కువ శాతం తెలంగాణ రాష్ట్రంలోనే ఆర్టీసీ బస్సులు ఉన్నాయన్నారు. బస్సులు నడిపేటప్పుడు ఏకాగ్రతతో నడపాలని, సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ప్రయాణికులు అందించాలని అన్నారు. అనంతరం రీజియన్ స్థాయిలో ముగ్గురు ప్రమాదరహిత డ్రైవర్లను సన్మానించారు. ప్రదమ స్థానంలో ఖమ్మం డిపో నుంచి బి.రాములు 28 సంవత్సరాల, నాలుగు నెలల్లో ఒక్క ప్రమాదం జరగని డ్రైవర్, ద్వితియ స్థానంలో ఖమ్మం డిపో నుంచి డిఆంథోని, తృతీయ స్థానంలో మణుగురు డిపో నుంచి వి వెంకటేశ్వర్లు 27 సంవత్సరాల 5నెలలు. వీరికి ముఖ్య అతిధులు చేతుల మీదుగా అవార్డులు ప్రశాంశా పత్రాలు అందించారు. రీజియన్‌లో ఏడు డిపో నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 21 మంది ప్రమాదరహిత డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ పవిత్ర, ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు..

ఎలక్ట్రోమెకానికల్ బూం బారియర్స్

భద్రాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని రామాలయ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అదునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎలక్ట్రో మెకానికల్ బూం బారియర్స్‌ను బుధవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. వీటిని ప్రసాద్ పథకంలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. భద్రాద్రి దేవస్థానం అధికారులు, ట్రాఫిక్ ఎస్సైలకు ఇందుకు సంబంధించిన రిమోట్‌లను సంబందిత సంస్థ సిబ్బంది అందజేశారు. ఐదేళ్లపాటు వీటి నిర్వహణ బాధ్యతను సంబంధిత సంస్థే చేపడుతుందని ప్రసాద్ స్కీము అధికారులు తెలిపారు.

ఇదిలా ఉండగా ఎలక్ట్రో మెకానికల్ బూం బారియర్స్ ఏ ర్పాటు చేసి 24 గంటలు కూడా కాక ముందే రాజవీధి వైపు ఉన్న బారియర్స్‌ను ద్విచక్ర వా హనంపై వచ్చిన చోదకులు ఢీ కొట్టడంతో అవి వంగిపోయాయి. దీంతో సీసీ ఫుటేజి ఆధారంగా సంబందిత ద్విచక్ర వాహనం నెంబరు యజమాని వద్ద ఇందుకు సంబంధించిన నష్టపరిహా రం వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో పోలీసులకు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.


సమావేశంలో పాల్గొన్న సీపీఎం నేతలు

మర్కోడు- రేగళ్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలి

సీపీఎం రాష్ట్ర నేత పోతినేని

ఆళ్లపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి మండలంలోని మర్కోడు నుంచి రేగళ్ల వరకు అటవీశాఖ అనుమతులు లేక నిలిచిన రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మర్కోడులో నిర్వహించిన సీపీఎం ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించారు. ప్రధానంగా మర్కోడు రేగళ్ల మధ్య అటవీశాఖ అనుమతులు తీసువచ్చి సౌకర్యవంతమైన రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. ఖమ్మం నుంచి మర్కోడుకి బస్సు సౌకర్యం, ఏజెన్సీలో గిరిజన గిరిజనేతరుల రైతులకు షరతులు లేకుండా సబ్సిడీలో బోర్లు, విద్యుత్‌సౌకర్యం, అర్హులైన ప్రతి పేదవాడికి ఒకే దఫాలో సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, బాలరాజు, కనకరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

వాహనదారులు నియమాలు పాటించాలి

మద్యం సేవించి వాహనాలను నడపవద్దు

భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు


మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వాహనదారులందరూ రహదారి భద్రతా నియమాలను విధిగా పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించే దానిలో భాగస్వాములు కావాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెంలోని ప్రకాశం మైదానంలో వాహనదారులకు, విద్యార్థులకు నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ వాహనదారులు మద్యాన్ని సేవించి. నిర్లక్ష్యంగా వాహనాలు నడపటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. వాహనదారులందరూ హెల్మెట్, సీటు బెల్టులను ధరించి వాహనాలను నడపాలని కోరారు. వేగంగా వాహనాలను నడపవద్దని పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించుకోవద్దని తెలిపారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించి బాధ్యతగా వ్యహరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, అనుమానస్పదంగా ఎవరైన కనిపిస్తే పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా 8 వేల ఆటోలకు పంపించేందుకు తయారు చేసిన స్టిక్కర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఆటో డ్రైవర్లందరూ సమాచారంతో కూడిన స్టిక్కర్లను తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలని కోరారు. అంతకుముందు మైదానంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ట్రాఫిక్ ఎస్సైలు నరేష్, మదార్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, పట్టణ సీఐలు కరుణాకర్, రమేష్, శివప్రసాద్‌లను శాలువాలతో ఎస్పీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ డీఎస్పీలు అబ్దుల్‌రెహమాన్, చంద్రభాను, రవీంద్రర్‌రెడ్డి, సతీష్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయ స్వామి, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్‌కు నిధులు మంజూరు చేయండి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి30 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రైల్వే లైన్ పనులు తక్షణమే నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ నాయకులు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ సభ్యులు వై.శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో కొత్తగూడెం కేంద్రంగా నిర్మించే కొవ్వూరు రైల్వే లైన్ నిర్మాణానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధులు విడుదల చేసి యుద్ధ ప్రాతిపదికన తక్షణమే నిర్మాణం పూర్తి చేసి తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్‌కు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు, సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు ఈ మెయిల్ సందేశాన్ని పంపించారు. అదేవిధంగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి వేలాది మంది యువతకు ఉపాధి ఉద్యోగాలు కల్పించాలన్నారు. కరోనాలో రద్దు అయిన రైళ్లను, కొల్లాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలన్నారు. కొత్తగూడెం కేంద్రంగా రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగూడెం నుండి డోర్నకల్ వరకు డబుల్ ట్రాక్ నిర్మాణ పనులను తక్షణం పూర్తి చేయాలని కోరారు. అమృత్ భారత్ నిధుల ద్వారా నిర్మిస్తున్న రైల్వే స్టేషన్‌ల ఆధునీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పుణ్య క్షేత్రాలైన తిరుపతి, శిరిడీకి కొత్తగూడెం నుండి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాలని, భద్రాచలం రామాలయానికి భక్తుల సౌకర్యార్థం రైల్వే లైన్‌తో పాటు ప్రత్యేక రైళ్లను నడపాలని అధికారులను కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అది చూసి భార్య ఆత్మహత్యాయత్నం

ఖమ్మం క్రైం జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహ్యకు పాల్పడి మృతిచెందిన సంఘటన గురువారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. అదిచూసిన భార్య కూడా ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని గొల్లగూడెం రోడ్డు నేతాజీనగర్ రోడ్‌నెంబర్ 3లో నివాసముంటున్న పత్తిపాటి రాజారత్నం(45) నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే అతని భార్య పత్తిపాటి భద్రాజికి అతనికి గత కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో గురువారం సాయంత్రం భార్య భద్రాజి వాకింగ్‌కు వెళ్లిన తరువాత రాజారత్నం భార్యకు ఫోన్‌చేసి తను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చెప్పాడు. దీంతో భార్య ఇంటి ప్రక్కవారికి ఫోన్‌చేసి చెప్పడంతో వారు వచ్చి చూసేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. వెంటనే భార్య భద్రాజి ఇంటికి వచ్చి భర్త మృతిచెందిన విషయాన్ని గమనించి, ఆమె కూడా గదిలోకి వెళ్లి తలుపులు వేసుకొని ఉరిపెట్టుకొని ఆత్మహత్యకు యత్నించింది. అప్పటికే ఇంటివద్ద ఉన్న చుట్టుప్రక్కలవారు గమనించి తలుపులు పగలగొట్టి ఆమెను రక్షించి, నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. కాగా మృతి చెందిన రాజారత్నం మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీకి తరలించారు.

ముగిసిన జేఈఈ, బీఆర్క్ మొదటి విడత పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 30:(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఎన్‌టీఏ నిర్వహించిన జేఈఈ పరీక్షలు బుధవారంతో ముగియగా, గురువారం బీఆర్క్ పరీక్షతో మొదటి విడత పరీక్షలు ముగిశాయని కోర్డినేటర్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. ఈ నెల 22న ప్రారంభమైన పరీక్షలు గురువారం ముగిశాయి. మొత్తం ఆరువేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా వారిలో ఐదువేల రెండు వందల మంది హాజరై, ఎనిమిది వందల మంది వరకు హజరుకాలేదని సమాచారం. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కో-ఆర్డినేటర్ తెలిపారు.

కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్‌పై శిక్షణ



కొత్తగూడెం అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 126 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్‌పై శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. శిక్షణ కార్యక్రమానుద్దేశించి డీఈవో కె. వెంకటేశ్వరచారి మాట్లాడారు. విద్యార్థులకు యుక్త వయస్సులో వచ్చే మార్పులు, మానసిక, విద్యాపరమైన మార్పులను తెలియజేసి ఒత్తిడిని ఏ విధంగా జయించాలో నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, రిసోర్స్‌పర్సన్లు ఎంఈవో ప్రభుదయాల్, గోపి వరప్రసాద్, ఎస్‌కే. మీరా సాహెబ్, ఎస్‌డీ.రవిప్రతాప్, బి.శ్యామచంద్రారావుతో పాటు 126మంది ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

81 కేజీల గంజాయి పట్టివేత

ఇద్దరు విలేకరులతో పాటు మరొకరి అరెస్టు

భద్రాచలం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని బ్రిడ్జి రోడ్డు చెక్‌పోస్టు మీదుగా గురువారం 81.950 కేజీల గంజాయిని తరలిస్తుండగా హైదరాబాద్ నార్కోటిక్స్ విభాగానికి చెందిన అధికారులు పట్టుకున్నారు. చెక్‌పోస్టు వద్ద సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా హుందాయ్ గ్రాండ్ వాహనంను తనిఖీ చేస్తుండగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కుంట తాలూక మర్లగూడకు చెందిన మడివి నందా, బూర్గంపాడు మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన పండగ వెంకటేశ్వర్లు, పండగ రాములుగా గుర్తించారు. కాగా పండగ వెంకటేశ్వర్లు, పండగ రాములు సోదరులు కాగా వీరు ఇరువురు బూర్గంపాడులో ప్రింట్ మీడియా విలేకరులుగా పనిచేస్తున్నారు. పట్టుబడిన వాహనంపై సైతం ప్రెస్ అని స్టికర్ ఉన్నట్లు సమాచారం. కాగా పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు, గంజాయితో పాటు కారును భద్రాచలం పట్టణ పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రికార్డులు స్వాధీనం

ఖమ్మం రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం నూతన మున్సిపాలిటికి సంబంధించిన 12 విలీన గ్రామ పంచాయతీలలోని రికార్డులను మున్సిపాలిటి అధికారులు స్వాదీనం చేసుకుంటున్నారు. ఆయా గ్రామాపంచాయతీల్లో ఇప్పటి వరకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చిన పర్మిషన్లు, ఇంటి పన్నుల వివరాలతో పాటు జనరల్ ఫండ్ ఎంత జమఅయింది, ఖర్చు ఎంత అయింది అనే వివరాలతో కూడిన రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నారు. పంచాయతీల కార్యదర్శులు రికార్డులను అప్పగించడానికి అన్ని రికార్డులు సరిచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మొత్తం మీద ఫిబ్రవరి 12 లోపు అన్ని రికార్డులను స్వాదీనం చేసుకుని మున్సిపల్ పాలన కొనసాగించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

అంబారుపేటలో సీసీ కెమెరాలు మాయం

మధిర రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని అంబారుపేట గ్రామంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని ఆ గ్రామస్థులు తెలిపారు.కెమెరాలు దొంగిలించిన వ్యక్తులను పట్టుకొని శిక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

బోనకల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెల్లి సంతోష్ పదవ తరగతి చదువుతున్నాడు. తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనం పై ఖమ్మం వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ట్రాలీ ఆటోను ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా 108 వాహనం ద్వార ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కొరకు హైదరాబాద్‌కు తరలించారు.

ద్విచక్ర వాహన ప్రమాదంలో..

చింతకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహన ప్రమాదంలో ముష్టికుంట్ల గ్రామానికి చెందిన సంతోష్‌కు కాలుకు తీవ్రగాయాలయ్యాయి. సంతోష్ మిత్రులతో కలసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బస్సును తప్పించబోయి ఎదురుగా వస్తున్న బోలోరోను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది కోట భాను సహాన్ ప్రమాద స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆద్వర్యంలో గురువారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ వైద్యశాలలో (40) చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందగా మార్చురీలో భద్రపరిచారు. వైద్య సిబ్బంది, ఓపీ పోలీసుల సమాచారం మేరకు గురువారం అన్నం శ్రీనివాసరావు మృతదేహన్ని స్వాధీనపరుచుకోని నగరంలోని బల్లేపల్లి వైకుంఠదామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎంసీ ట్రాక్టర్‌కు ప్రమాదం

డ్రైవర్ మృతి, మరో ఇద్దరికి తప్పిన ప్రాణాపాయం

పొంతన లేని విధులతో తరుచూ ప్రమాదాలు

బయటపడుతున్న అధికారుల బాధ్యతారాహిత్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో పారిశుధ్య పర్యవేక్షణా అధికారుల బాధ్యాతారాహిత్యంతో ఏ రోజు ఏ పారిశుధ్య కార్మికుడు ప్రమాదానికి గురైతాడో తెలియని పరిస్థితి ఏర్పడింది. పొంతన లేని డివిజన్లకు అసందర్భంగా పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు మార్పుతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పారిశుధ్య కార్మికుల ప్రాణాలు కోల్పోతున్నారు.

కేఎంసీ సమీపంలోనే ట్రాక్టర్ ప్రమాదం

ఖమ్మం నగరంలోని 2వ డివిజన్‌లో శివకుమార్ రెండు నెలలుగా స్వచ్ఛభారత్ ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లారుజామున మాత్రం రెగ్యూలర్ విధులకు వెళ్లకుండా మరో డివిజన్‌లోని పారిశుధ్య ట్రాక్టర్‌ను నడిపేందుకు వాహనాన్ని కేఎంసీ కార్యాలయం నుంచి బయటకు తీశాడు. ఇలా కొద్ది దూరం వెళ్లగానే సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న బడ్డీ కొట్టును ట్రాక్టర్‌తో ఢీ కొట్టించాడు. దీంతో ట్రాక్టర్‌పై నుంచి శివకుమార్ కిందకు దూకాడు. ఆదే సమయంలో పాల ప్యాకెట్లు బడ్డీ కొట్టులో వేసేందుకు ఇద్దరు వ్యక్తులు అక్కడకు ద్వీ చక్ర వాహనంపై వచ్చారు. ట్రాక్టర్ బడ్డీ కొట్టుమీదకు రావటంతో వారు చాకచక్యంగా తప్పించుకున్నారు. త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కాగా ట్రాక్టర్‌పై నుంచి దూకిన శివకుమార్‌ను స్థానికులు 108 వాహనంలో జిల్లా హాస్పటల్‌కు తరలించగా వైద్యులు ప్రాథమిక వైద్యసేవలు అందించి శివకుమార్‌ను ఇంటికి పంపారు. తర్వాత ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికే శివకుమార్ అపస్మారకంలోకి వెళ్లారు. తిరిగి శివకుమార్‌ను జిల్లా హాస్పటల్‌కు బందువులు తీసుకరాగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు.

మేయర్ పునుకొల్లు నీరజ, మృతుడి శివకుమార్‌కు నివాళులు అర్పించారు. అంతిమ కార్యక్రమాలకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. కేఎంసీ నుంచి రూ.2లక్షలు, కుటుంబంలోని ఓ వ్యక్తికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని అధికారులు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

జాతరను విజయవంతం చేయాలి: చందా

కరకగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమళ్ల పంచాయితీలో ఫిబ్రవరి 11 నుంచి జరగనున్న సమ్మక్క, సారలమ్మ జాతరను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య దొర పిలుపునిచ్చారు. గురువారం చిరుమళ్ల సమ్మక్క, సాలరమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 200 వందల సంవత్సరాలుగా చందా వంశీయుల ఇలవేల్పు అయిన సమ్మక్క, సారలమ్మ జాతర మహోత్సవం మేడారం జాతర మహోత్సవం జరిగిన మరుసటి సంవత్సరం ఇక్కడ అత్యంత వైభవంగా జరిపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చందా భిక్షపతి, భూపతయ్య, మడు, కొమరం వెంకటేశ్వర్లు, గొగ్గలి రవి, సతీష్, వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
శుక్రవారం 31 జనవరి 2025
● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి
ఖమ్మం సిటీ
ZONE 8



సామూహిక సీమంతాలు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి30(ఆంధ్రజ్యోతి): నగరంలోని 51వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీకేంద్రంలో గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు చీర, జాకెట్, పూలు, పండ్లు, స్వీట్స్ అందించారు.అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	44
పచ్చిమిర్చి	28
బెండకాయ	38
బెండకాయ	48
పొట్లకాయ	34
దోసకాయ	28-44
చిక్కుడు	38
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	20
దొండ	38-44
సొరకాయ	18
క్యారెట్	38
క్యాప్సికం	74
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	155
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	గేంచేంజర్
శ్రీనివాస:	డాకూ మహారాజ్
సాయిరాం:	పుష్ప 2
కేపీఎస్:	ప్రేమిస్తా
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

జాతిపితకు ఘన నివాళి

ఖమ్మంవ్యవసాయం, జనవరి30(ఆంధ్రజ్యోతి): చాంబర్‌ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని నిర్వహించారు. త్రీటౌన్‌లోని గాంధీ విగ్రహానికి చాంబర్ ఆఫ్‌కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమ నరసింహారావు(జీవైన రేష్) తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. గాంధీజీ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసి దేశానికి స్వాతంత్రం తెచ్చిపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ సహాయ కార్యదర్శి మస్నెం కృష్ణయ్య, సెంట్రల్ ఈసీ సభ్యులు కైలాసపు వేణుగోపాలరావు, శ్రీవిడాల శ్రీనివాసరావు, కోల్డ్‌స్టోరేజ్ శాఖ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మిర్చిశాఖ కార్యదర్శి యడ్లపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంసాంస్కృతికం: నగర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం గాంధీ చౌక్‌లో నిర్వహించారు. నగర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుమ్మడివెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.



నగర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చాంబర్ నాయకులు



డీసీసీలో మహాత్మాగాంధీ వర్ధంతి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ చూపిన శాంతియుత మార్గం ఇప్పటికీ ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందని జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండీ జావీద్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గాంధీ 77వ వర్ధంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీ చూపిన శాంతియుత మార్గంలో మానవాళి నడవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో అహింసామార్గాన్ని చూపిన నాయకులు మహాత్మాగాంధీ అని కొనియాడారు.కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఓబీసీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నీటివనరుల ఆక్రమణలు తొలగించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- 12లోపు నివేదికలు అందించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి30 (ఆంధ్రజ్యోతి): నీటి వనరుల ఆక్రమణలు గుర్తించి ఫిబ్రవరి 12లోపు నివేదికలు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నీటివనరుల ఆక్రమణ, భూసేకరణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ప్రతీ 45 మీటర్లకు ఒక విభాగంగా పరిగణించి వాల్ నిర్మించడానికి ఒక బే యూనిట్ అంటారని, మొత్తం 17 కిలో మీటర్ల స్ట్రెచ్‌లో 345 పైగా బేయూనిట్ లుగా నిర్మించాలన్నారు. వీటిలో8.5కిలోమీటర్ వరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, మిగిలిన పట్టా భూమి సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములలో పనులు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. వాల్ నిర్మాణానికి అవసరమైన పట్టా భూముల సేకరణకు పట్టాదారు వారీగా మ్యాపింగ్ చేసి వివరాలు అందించాలన్నారు. భూ సేకరణ వేగవంతంగా జరిగేలా చూడాలని, 15రోజులలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. భూసార పరీక్షలు చేసి వాల్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. అదనపు బృందాలను రంగంలోకి తీసుకొచ్చి పనులు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని నీటి వనరుల వద్ద ఆక్రమణకు గురైన భూముల వివరాలను రెవెన్యూ మ్యాప్, నీటిపారుదల మ్యాప్, టౌన్‌ప్లానింగ్ రికార్డులను పరిశీలించి సమన్వయంతో గుర్తించి ఫిబ్రవరి12లోపు వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, లాండ్ సర్వే ఏడీ శ్రీనివాసులు, నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

టీజీ ఐపాస్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ



అధికారులతో సమీక్షిస్తున్న శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, జనవరి30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టీజీ-ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులపై గడువులోగా నిర్ణయం తీసుకోవాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆమె జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. పరిశ్రమల స్థాపన, టీజీఐపాస్, టీ-ప్రైడ్‌పై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వచ్చిన 22 ప్రతిపాదనలలో 15 ప్రతిపాదనలకు వివిధ శాఖల జారీ చేసిన అనుమతులను, తిరస్కరించిన 3ప్రతిపాదనలను అదనపు కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న 4ప్రతిపాదనలు సైతం సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో టీ-ప్రైడ్ పథకం కింద ఏర్పాటు చేసిన 10ఎస్సీఎస్టీ యూనిట్లకు 33 లక్షల 39వేల 282 రూపాయల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేశామన్నారు. ఈసమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం టి.సీతారాం, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్, నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్, రైస్‌మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వర రావు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలపై సమీక్ష

అంగన్వాడీ కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. గురువారం ఆమె కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో మహిళా,శిశు దివ్యాంగుల సంక్షేమశాఖ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. పోషణ అభియాన్, ప్రీస్కూల్ నిర్వహణ, అంగన్వాడీ కేంద్రాల పనితీరు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, లబ్ధిదారుల వివరాలు, అనీమియా నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. ఖమ్మం అర్బన్, రూరల్, తిరుమలాయపాలెం, మధిర, కామేపల్లి, కల్లూరు, సత్తుపలి సీడీపీవోలు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లాసంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి,సీడీపీఓలు, ఏసీడీపీఓలు, డీఎంసీ డీహెచ్‌ఇ డబ్ల్యు ఎస్డీ.నస్రిన్ పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు

తిరుమలాయపాలెం, జనవరి30(ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపడుతున్నటుట సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోనిపిండిప్రోలు శివారుపాపాయిగూడేనికి చెందిన సీపీఎం నేత రేపాకుల వెంకన్న సంస్మరణసభలో మాట్లాడారు. వెంకన్న స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, బషీరుద్దీన్,మండల కార్యదర్శి కొమ్ము శ్రీను బింగి రమేష్, పప్పులప్రసాద్, వశపొంగు వీరన్న, రామనబోయిన రవి, వెంకటేశ్వర్లు, పి.సుధాకర్, ఆర్.శివలింగం పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ లీకు



లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న సెప్టిక్ ట్యాంక్‌లోని మానవ వ్యర్థాలు

ఖమ్మంమార్కెట్, జనవరి30(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లోని ఆరోనెంబరు గేటు వద్ద ఉన్న మరుగుదొడ్డి సెప్టిక్ ట్యాంక్ గురువారం లీకేజీ కావడంతో మానవ వ్యర్థాలు రోడ్డుపై ప్రవహించాయి. దీంతో మార్కెట్‌లో పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులు, వ్యాపారులు, కార్మికులు ఇబ్బందులు పడ్డారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేని కారణంతోనే సెప్టిక్ ట్యాంక్ అప్పుడప్పుడూ బ్లాక్ అవుతుందని, లీకేజీ కారణంగా ఇబ్బంది పడుతున్నామని కార్మికులు, రైతులు చెప్పారు. రోడ్లపై వ్యర్థాలు భారీగా ప్రవహించడంతో అటు వైపుగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి30 (ఆంధ్రజ్యోతి):పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేలా శిక్షణ కార్యక్రమాలు ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ అన్నారు. గురువారం నగరంలోని టేకులపల్లి డైట్ కళాశాలలో క్యారియర్ కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్ ట్రైనింగ్ రెండు రోజుల కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూల్స్, కేజీబీవి, టీఆర్ఈఐఎస్ ఉన్నత పాఠశాల ఎంపికైన ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈవో, జిల్లా విద్యాశిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాలల్లోనే సుచనలు, సలహాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ ఏఎంఓ రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల సమస్యలకు పరిష్కారం

- మంత్రి తుమ్మల ఆదేశాలతో కదిలిన కేఎంసీ
- అల్లీపురంలో రెవెన్యూ మేళాకు 232 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ రావూరి కరుణ, ఆర్వో శ్రీనివాసరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఖమ్మం నగరంలో విలీనమైన గ్రామాల ప్రజల పదేళ్ల రెవెన్యూ సమస్యలు పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. ఇటీవల 15వ డివిజన్‌లో మూడు రహదారులకు తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు చేశారు. అనంతరం అల్లీపురం బహిరంగ సభలో మాట్లాడారు. కార్పొరేటర్ రావూరి కరుణతో పాటుగా గ్రామ ప్రజలు ఇంటి పన్నులు, ఇంటి నెంబర్లు, విద్యుత్ మీటర్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం అల్లీపురంలో ప్రత్యేక రెవెన్యూ మేళాను రైతువేదికలో నిర్వహించారు. కార్పొరేటర్ రావూ రి కరుణ, ఆర్వో శ్రీనివాసరావు వినతులు స్వీకరించారు. ఇంటినెంబర్లు కోసం220, ఖాళీస్థలాల సర్వే కోసం9, పంపుపన్నుల కోసం 3 దరఖాస్తులు ప్రజలు అందించారు. పక్షంరోజుల్లోగా పరిష్కారం చూపుతామని రెవెన్యూ అధికారి తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

కేఎంసీ ఎదుట టీయూసీఐ నాయకుల నిరసన



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఖమ్మం నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ) మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి జీ రామయ్య డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ ఎదుట కార్మికులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పెరుగుతున్న నిత్యవసరాలకు తగిన స్థాయిలో కార్మికుల వేతనాలు పెరగటం లేదన్నారు. 2016లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో పెరిగిన జనాభా లెక్కల మేరకు పారిశుద్య కార్మికుల సంఖ్యను పెంచాలని, ప్రతీనెల 10 లోపుగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందించారు. నాయకులు దున్న గురవయ్య,నారాయణ,గడ్డం వెంకన్న, యుగంధర్, దేవా సావిత్రి, కృష్ణ, నందినికుమారి, స్వప్న,వీరబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కార్పొరేటర్ చేమకూరి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 19వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన కార్పొరేటర్ చేమకూరి వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు ఎండీ జావీద్ చేమకూరి వెంకటేశ్వరరావుకు కాంగ్రెస్ కండువా కప్పి స్వాగతించారు. రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి వడ్డెబోయిన నర్సింహారావు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీలతోనే పేదలకు రక్షణ: బాగం

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి30 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజలకు రక్షణ ఉంటుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీపీఐ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. దేశంలో అవకాశవాద రాజకీయాలు పెరిగిపోతున్నాయని, అవకాశవాద రాజకీయాలతో ప్రజాస్వామ్యంలో పెనుప్రమాదం ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తూ ఊసరవెల్లుల్లా పార్టీలు మారుతున్నారని, ఇటువంటి వారితో కమ్యూనిస్టులకు ఎటువంటి నష్టం ఉండదన్నారు. రాష్ట్రప్రభుత్వం పట్టణ పేదలకు సైతం సంక్షేమ కార్యక్రమాలను అమలుచేయాలన్నారు. వ్యవసాయరంగంలో వచ్చిన వడిదుడుకులు కారణంగా వేలాది కుటుంబాలు పట్టణాలకు వలస వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్కే జానిమియా, పగడాల మల్లేష్, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మినారాయణ, వరద నర్సింహారావు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

కల్లూరు,జనవరి30(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మిషన్ భగీరథ కార్మికుడి కుటుంబానికి తోటికార్మికులు గురువారం రూ.12 వేలు ఆర్థిక సహాయం అందించారు. అంబేద్కర్‌నగర్‌కు చెందిన మిషన్ భగీరథ కార్మికుడు సిద్దం రవికుమార్ తల్లి ద్రౌపది ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినది. వైద్యంకోసం ఆ కుటుంబం ఆర్థికంగా నష్టపోవటంతో సాయం అందించారు.

ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

మధిరటౌన్, జనవరి30(ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మండడి రవీంద్రారెడ్డికి డాక్టరేట్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గురువారం మధిరడిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ఆయల్ సీడ్స్ కల్టివేషన్ ఇన్‌హైదరాబాద్ స్టేట్ అనే అంశంపై పరిశోధనా సిద్దాంత గ్రంథాన్ని సమర్పించారు.

డీట్ పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి30:(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్)ఉద్యోగ సమాచార పోస్టర్‌ను గురువారం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జాకీరుల్లా ఆవిష్కరించారు. కళాశాలలో చదువుతున్న డిగ్రీ, తృతియ, పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 920 మంది డీట్ యాప్‌లో అర్హతలను బట్టి పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇండస్ట్రీస్ ఆఫ్ కామర్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల కోసం ఈ యాప్‌ను ప్రారంభించింది. అనంతరం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. క్విజ్ పోటీలు నిర్వహించారు.

సీడీసీ డైరెక్టర్ మధుకు సన్మానం



మధును సన్మానిస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, జనవరి30(ఆంధ్రజ్యోతి): సీడీసీ డైరెక్టర్‌గా నియమితులైన మూటాపురం గ్రామానికి చెందన గుడిమళ్ళ మధును గురువారం ఖమ్మం మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి సత్కరించారు. సీడీసీ డైరెక్టర్‌గా నియమితుడైన మధు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందులకు కృతజ్ఞతలు తెలిపారు. మూటాపురంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు మధును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, బొల్లినేని వెంకటేశ్వర్లు, కట్టా రాజేష్, గుడిమళ్ళ మోహన్, ఏలూరి సురేష్, ఏలూరి హనుమంతరావుశ్యామలేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

తిరుమలాయపాలెం, జనవరి30(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు. గురువారం మండలంలోని దమ్మాయిగూడెం, పిండిప్రోలులో రోడ్డుభద్రతా వారోత్సవాలలో భాగంగా వాహనదారులకు అవగాహన కలిపించారు. ర్యాలీ చేపట్టారు. ఈకార్యక్రమంలో పోలీసుని బ్బంది ప్రసాద్, ఎల్.వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం, జనవరి30(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రగడ్డలో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ నేతల కుటుంబాలను పరామర్శిస్తారు.. అనంతరం ఏలువారిగూడెంలో నాలుగు పథకాల లబ్ధిదారులతో మాట్లాడనున్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు

- సేవాదళ్ కార్యదర్శి నాగరాజు

నేలకొండపల్లి,జనవరి30(ఆంధ్రజ్యోతి):కేంద్రం ఇచ్చే అవార్డుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, వెంటనే ఉపసంహరించుకోవాలని పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ కన్వీనర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మంత్రిస్థాయిలో ఉండి సంజయ్ అలాంటి వ్యాఖ్యలు చేయటం ఆయన స్థాయికి తగదన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంరూరల్: గద్దర్‌పై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో బండి సంజయ్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, రమణ, క్రాంతి, అంజనీ, రవీందర్, నవీన్, భూక్యా సురేష్, సీతారాములు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సత్తుపల్లిరూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరికాలనీలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.58,116నగదును దాతలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఇంజనీర్ వడ్డేపల్లి సదానందం, లక్ష్మీ, శ్రీధర్, శ్వేతలను ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్, రాగాల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దానవాయిగూడెం పార్కును కబ్జాదారుల నుంచి రక్షించండి

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని దానవాయిగూడెం పార్కును రోజురోజుకు కబ్జాదారులు ఆక్రమిస్తున్నారని, వారి నుంచి ఈ పార్కును రక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ బృందంసభ్యులు దానవాయిగూడెం పార్కును సందర్శించారు. ఫిల్టర్‌బెడ్ వాటర్‌ట్యాంక్ గుట్టని కూడా తవ్వుతున్నారని తెలిపారు. ఈ ట్యాంకు నుంచి మున్నేటి వరకు ప్రహరీ గోడలు కట్టి ప్లాట్లు అమ్ముతున్నారన్నారు. గుట్టను తవ్వితే ఫిల్టర్‌బెడ్ ట్యాంక్ దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఒక పక్కన వరదలు వస్తే మున్నేరు చుట్టుపక్కల ప్రాంతాలు వరద ముంపుకు గురవుతున్నాయని, కరకట్ట కడుతుంటే మరోపక్క కబ్జాదారులు ప్రైవేటు స్థలం అంటూ కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివారెడ్డి, త్రీటౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, ఎస్కే చాంద్, మహమద్ రఫీ పాల్గొన్నారు.





ఆంధ్రజ్యోతి
ZONE
శుక్రవారం 31 జనవరి 2025
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

వైరా మార్కెట్ కమిటీ నియామకమెప్పుడో..

» చైర్మన్ పదవి కోసం పోటాపోటీగా ఆశావహుల ఎదురుచూపులు

వైరా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 13నెలలు గడిచిన ప్పటికీ వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం అనేకమంది ఆశావహులు పోటీపడుతున్నారు. బీసీకి చైర్మన్ పదవి రిజర్వు అయిఉంది. ఆసామాజిక వర్గానికి చెందిన నాయకులు చైర్మన్ పదవి కోసం తమకున్న మార్గాల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ పాలకవర్గ నియామకంలో ఆలస్యం జరుగుతుండటం వలన వారు తీవ్ర నిరాశనిస్పృహలకు లోనవుతున్నారు. వైరా, తల్లాడ, కొణిజర్ల మండలాల పరిధిలో ఈ మార్కెట్ కమిటీ ఉంది. చైర్మన్ పదవిని వైరా, కొణిజర్ల మండల నాయకులు ఆశిస్తున్నారు. వైస్‌చైర్మన్ పదవి సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండలానికి కట్టబెట్టే అవకాశముంది. జిల్లాలో ఇప్పటికే ఖమ్మం, మధిర ఇంకా అనేక వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించారు. వైరాలో మాత్రం ఈ పాలకవర్గ విషయంలో ఎటూ తేలకుండా తర్జనభర్జనల వ్యవహారం కొనసాగుతుంది. ఎట్టి పరిస్థితులోనూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆమోదంతోనే ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టాల్సి ఉంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కూడా వైరాకే చెందిన వారు కావడంతో భట్టి విక్రమార్క సూచనలతో ఆయన కూడా తమ వర్గీయుడిని నియమించుకోవాల్సిన పరిస్థితి.

వైరా మునిసిపాలిటీలోని ద్వారకానగర్‌కు చెందిన బోళ్ల గంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు చైర్మన్ పదవి కోసం డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఇద్దరిలో ఆయన ఎవరివైపు మొగ్గుచూపుతారో అర్థం కాని పరిస్థితి. అలాగే మండలంలోని రెబ్బవరం మాజీ సర్పంచ్ గుత్తా కళావతి చైర్మన్ పదవి కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడి ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నిత్యం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను కలిసి ఈ పదవిని తమకు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. కొంతమంది కాం గ్రెస్ నాయకులు కూడా ఆమెకు మద్దతుగా తమవంతు పావులు కదుపుతున్నారు. సిరిపురానికి చెందిన చప్పిడి వెంకటేశ్వరరావు, స్నానాల లక్ష్మీపురానికి చెందిన నూతి వెంకటేశ్వరరావు పేర్లు కూడా విన్పిస్తున్నాయి. కొణిజర్ల మండలానికి చెందిన ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు ఇతర బీసీ నాయకులు ఈ పదవిని ఆశిస్తున్నప్పటికీ వారికి అవకాశాలు తక్కువ అని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి.

మొత్తంగా రంగారావు, సీతారాములు, కళావతి మధ్యనే తీవ్ర పోటీ ఉంది. ఈ ముగ్గురిలో ఎవరిని ఎప్పుడు ఈ పదవి వరిస్తుందో, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు ఎవరికి ఆమోదముద్ర వేస్తారోనని తీవ్ర ఉత్కంఠత నెలకొంది. ఇప్పట్లో పాలకవర్గ నియామకం జరిగేనా అనే చర్చ కూడా నడుస్తోంది.



వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ

రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్

ఎర్రుపాలెం, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సరస్వతి డిగ్రీ కళాశాలలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైరా డివిజన్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ ముఖ్యఅతిధిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. వాహనదారులు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ఈకార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, నాగిరెడ్డి సౌజన్య, రమేష్, శ్యాంప్రసాద్, నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చివరి ధాన్యం గింజవరకు కొనుగోలు చేస్తాం

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గ పరిధిలోని రైతు లు ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధా న్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని, రైతులెవరూ ఆందోళన చెందొద్దని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రకటించారు. రైతుల కల్లాలు, రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ బుధవారం నుంచే ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైతుల దీనావస్థను వివరిస్తూ 'ధాన్యం కొనుగోళ్ల నిలిపివేత' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురించిన కథనానికి ఎ మ్మెల్యే రాందాస్‌నాయక్ వెంటనే స్పందించారు. ఆమేరకు రైతులకు భరోసా ఇస్తూ చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి రూ.500బోనస్ కూడా చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఏఒక్క రైతు తొందరపడి ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రతి గింజ కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.



కారేపల్లిలో ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల సైదులు కుటంబానికి గురువారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ రూ.రెండు లక్షలకు ఎల్‌వోసీని అందజేశారు. పచ్చిపాల సైదులు కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటన్నాడు. అయితే మరింతవైద్యం కోసం నగదు అవసరం కావడంతో కుటుంబసభ్యులు ఎమ్మెల్యేను కలిసి విషయం తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.రెండు లక్షలకు ఎల్ఓసీని అందజేశారు.

సిరిపురం ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

మధిర రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పరీక్షలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్, ఓపీ గురించి అడిగి తెలుసుకుని ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నిర్మలజ్యోతి, ప్రదీప్, సుజాత, ఝాన్సీ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు



సత్తుపల్లిలో బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

గాంధీజీ వర్ధంతి

మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పట్టణాలలో, గ్రామాలలో నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, గంగారం బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ.రంగారెడ్డి, కల్లూరులో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, మధిరటౌన్‌లో పార్లమెంటరీ కన్వినర్ డా. వాసిరెడ్డి రామనాథంతో పాటు పలువురు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



మధిరటౌన్‌లో....



వేంసూరులో...



కల్లూరులో...



ముదిగొండలో..

అవకతవకలపై విచారణ జరిపించండి



వినతిపత్రం అందిస్తున్న కార్మిక నాయకులు

సత్తుపల్లిరూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సర్వే డిపార్ట్‌మెంట్ ఎగ్జామ్ అసిస్టెంట్ చైన్‌మెన్ ప్రమోషన్లలో అవకతవకలపై జరిగాయంటూ ఆరోపిస్తున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్వాలిఫై అయిన సీనియర్ కార్మికులను కాదని, జూనియర్ కార్మికులకు ప్రమోషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. సీనియర్ కార్మికులకు తగు న్యాయం చేస్తానని జీఎం హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సముద్రాల సుధాకర్, జక్కుల గట్టయ్య, భరణి, శేషగిరిరావు, పోలోజు శివకుమార్, రమేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంగ్రెస్ నాయకుడి మృతి



రంగారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైరా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాజీవ్‌గాంధీ విమానాశ్రయానికి వెళ్తూ ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వైరా కాంగ్రెస్ నాయకుడు వెంపటి రంగారావు(60)మృతిచెందాడు. ఆయన భౌతికకాయానికి గురువారం వైరాలో అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగు నెలల కిందట తన కుమార్తెను విదేశాలకు పంపించేందుకు వెళ్తూ విమానాశ్రయానికి కొద్దిదూరంలోనే రంగారావు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోనే చికిత్స పొందుతూ మృతిచెందాడు. రంగారావు భౌతికకాయానికి టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు, పమ్మి అశోక్, పాలేటి నర్సింహారావు, బొర్రా గోవిందరావు, పసుపులేటి వెంకన్న, గుత్తా రామారావు, గుగులోతు రాము నివాళులర్పించారు. అలాగే బ్రాహ్మణపల్లిలో మృతిచెందిన వేల్పుల మరియమ్మ భౌతిక కాయానికి కూడా నాయకులు నివాళులర్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

మధిరటౌన్, జనవరి30(ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మందడి రవీంద్రారెడ్డికి డాక్టరేట్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఈ మేరకు గురువారం మధిర డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు, ఆయల్ సీడ్స్ కల్టివేషన్ ఇన్ హైదరాబాద్ స్టేట్ అనే అంశంపై పరిశోధనా సిద్దాంత గ్రంథాన్ని యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దయాకర్ పర్యవేక్షణలో సమర్పించినందుకు డాక్టరేట్ డిగ్రీని ప్రకటించిందని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణ, అధ్యాపకులు ఇందిర, సుజాత, అప్రోజ్, అనిత, జ్యోతి, మాధురి అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలి

» ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు



కల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. గురువారం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించిన లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు సభను విజయవంతం చేయాలని కల్లూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, జాస్తి శ్రీనువాసరావు, చిట్టిబాబు, వెంకన్న, రాధాకృష్ణ, సయ్యద్ అలీ, ధర్మాసోతు దశరథ్‌నాయక్, నరసింహారావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, కిరణ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీకి పరికరాల వితరణ

పెనుబల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, కుర్చీలను వితరణగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ ఆళ్ల సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని అనానరు. కళాశాల ప్రిన్సిపల్ యూసఫ్‌అలీ మాట్లాడుతూ దాతలు ఇచ్చిన వస్తువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వీజీఎఫ్ డైరెక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా అనేక సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని, కళాశాల ప్రిన్సిపల్ అడిగిన వెంటనే ట్రస్టు ఫౌండర్ ఆళ్ల రంగారావు సూచనల మేరకు 8కొత్త ఫ్యాన్లు, 15ఫ్యాన్లు రిపేరు, 25ట్యూబ్‌లైట్లు, పది కుర్చీలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

మధిర రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరుపేట పీహెచ్‌సీలో గురువారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీరబాబు ఆధ్వర్యంలో ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ పర్సన్ ఇన్‌చార్జ్ శరత్‌బాబు, హెచ్‌వీ నిర్మలజ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ముదిగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి నివారణకు ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

సత్తుపల్లిరూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.58,116నగదను దాతలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఇంజనీర్ వడ్డేపల్లి సదానందం, లక్ష్మీ, శ్రీధర్, శ్వేతలను ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్, రాగాల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

కల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మిషన్ భగీరథ కార్మికుని కుటుంబానికి తోటి కార్మికులు తమ వంతుగా గురువారం రూ.12 వేలు ఆర్థిక సహాయం అందించారు. స్థానికంగా అంబేద్కర్‌నగర్‌కు చెందిన మిషన్ భగీరథ కార్మికుడు సిద్దం రవికుమార్ తల్లి ద్రౌపది ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినది. వైద్యం కోసం ఆ కుటుంబం ఆర్థికంగా నష్టపోయారు. తోటి కార్మికులు ముందుకు వచ్చి తమ వంతుగా ఆర్థిక చేయూతనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, బీఆర్టీయూ సీఐటీయూ నాయకులు ఎం. తిరుపతరావు, వి. రమేష్, యు. వేణుబాబు, ఎం. ప్రసాదరావు, ఎం. రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం జిల్లా కార్యదర్శిగా కనకారావు

సత్తుపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల జిల్లా కార్యదర్శిగా సత్తుపల్లికి చెందిన పిన్నం కనకారావు ఎన్నికయ్యారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఇటీవల నిర్వహించిన ఎన్నికలలో వెంకట్ ప్యానెల్ విజయం సాధించగా కనకారావును గురువారం సత్తుపల్లిలో ఘనంగా సన్మానించారు. అందరి సంక్షేమం కోసం పనిచేస్తూ ప్రభుత్వానికి విన్నవించి అభివృద్ధి కోసం పనిచేస్తానని కనకారావు అన్నారు. కార్యక్రమంలో సోనీ పాషా, సుమాంజలి రాము, కల్కి వెంకటేశ్వరరావు, లామినేషన్ సుబ్బారావు, కృష్ణ, గాంధీ, మారేష్, మూర్తి, కిరణ్, మిక్సింగ్ నరేష్, ప్రభాస్, నరసింహారావు, రాంబాబు, బాబా పాల్గొన్నారు.

బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

» టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ యాకుబ్ పాషా

బోనకల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గత ఏడాది జూన్ నెలలో జరిగిన బదిలీలల్లో స్పౌజ్ పాయింట్స్‌ను దుర్వినియోగ పరిచిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ యాకుబ్ పాషా డిమాండ్ చేశారు. బోనకల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటేషన్ విధించిన టీచర్ల స్థానంలో కొత్తవారు వచ్చినా ఇంకా వారిని రిలీవ్ చేయకపోవడం శోచనీయమన్నారు. పరస్పర బదిలీలతో పాటు స్పౌజ్ బదిలీలు, అక్రమ డిప్యూటేషన్లు తదితర అక్రమాల గురించి ఇప్పటికే తమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖలో అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని కోరారు.

'విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు'

చింతకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వేసవిలో గృహ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు డీఈ నంబూరి రామారావు తెలిపారు. మండల పరిధిలోని నరసింహపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫారమ్‌ను ఆయన ప్రారంభించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చింతకాని సెక్షన్ పరిధిలో 8 సింగిల్ ఫేస్ 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ తిలక్, ఏఈ శ్రీధర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవికి ముందే ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటు..

వైరా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవికాలం నాటికి గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్య లేకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామాల్లో అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్నామని వైరా ట్రాన్స్‌కో డీఈ బండి శ్రీనివాసరావు తెలిపారు. వేసవి ప్రణాళికలో భాగంగా మండలంలోని గన్నవరం గ్రామంలో రెండుచోట్ల ఏర్పాటుచేసిన 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం డీఈ ప్రారంభించారు. ట్రాన్స్‌కో వైరా ఏడీఈ పి.కిరణ్‌కుమార్, రూరల్ ఏఈ పాలేటి వెంకటసాయి తదితరులున్నారు.

రాతోని లిఫ్టును పరిశీలించిన ఎస్ఈ వాసంతి

పెనుబల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాతోని లిఫ్టు పంపు షెడ్‌ను ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి గురువారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అన్నారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి లిఫ్టు ఇరిగేషన్‌ను సక్రమంగా నడుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ కిరణ్‌కుమార్, లిఫ్టు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆశయాలు సాధించాలి: సీపీఎం

కారేపల్లి, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రబోడు గ్రామానికి చెందిన కుంజ వెంకన్న కడవరకు కమ్యూనిస్టుగానే పనిచేశాడని, ఆయన ఆశయాలు సాధించాలని వైరా డివిజన్ సీపీఎం కార్యదర్శి భూక్యా వీరభద్రం, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి దుగ్గికృష్ణ అన్నారు. గురువారం వెంకన్న కుటంబాన్ని పరామర్శించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. మండల పార్టీ కార్యదర్శి కె.నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

బోనకల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు అన్ని చోట్ల తక్షణమే నిబంధనలను అమలు చేస్తున్నామని తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమాలను గురువారం నిర్వహించారు.

ధరణి పోర్టల్ పాస్ పుస్తకాలు రద్దు చేయాలి

» రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

కొణిజర్ల, జనవరి30(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఇచ్చిన ధరణి పోర్టల్ పాస్ పుస్తకాలను రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని లాలాపురం గ్రామంలో తుమ్మల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మల చెరువులో ఆక్రమణలను గత నాలుగురోజుల క్రితం అధికారులు తొలగించటం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, సంక్రాంతి నర్సయ్య, సంక్రాంతి పురుషోత్తం, వడ్లమూడి మధు, రామకృష్ణ, బ్రహ్మేశ్వరరావు, రాందాస్, రవి, వెంకట్, ప్రసాద్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేసేంత వరకు పోరాటం'



సత్తుపల్లిరూరల్: గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మధిరటౌన్, జనవరి30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు పోరాటం చేస్తామని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ నాయకులు గురువారం మధిరలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, రూరల్, పట్టణ కార్యదర్శులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై.వి. అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ప్యారి, కటికల సత్యనారాయణ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంసూరులో...

వేంసూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మర్లపాడులో గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు సోమిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, మారోజు సురేష్, కుక్కపల్లి సుధాకర్, నల్లమోతు ప్రసాద్, రావూరి శ్రీను, జాబిశెట్టి కోటేశ్వరరావు, కిన్నెర రాము, గొర్ల రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లూరులో...

కల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడంపై నిరసిస్తూ బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందించారు.



పెనుబల్లిలో....



తల్లాడలో...

ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, బీరవెల్లి రఘు, కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, పెద్దబోయిన మలేశ్వరరావు, నారాయణరావు, కాటంనేని వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, పాలడుగు శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో...

తల్లాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 420హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తల్లాడలో గాంధీ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, దిరిశాల దాసూరావు, బద్దం కోటిరెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, కేతినేని చలపతిరావు, నాయుడు శ్రీనివాసరావు, జీవీఆర్, మువ్వా మురళీధర్‌రావు, వనిగండ్ల అశోక్, అంబేద్కర్ పాల్గొన్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం వీఎంబంజర్‌లోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మందడపు అశోక్‌కుమార్, కనగాల సురేష్‌బాబు, దొడ్డపనేని రవి, వంగా గిరిజా, తోట రామారావు, కొప్పుల గోవిందరావు, పొట్లపల్లి శివశంకర్ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నెముక అయిన రైతుకు తెలంగాణలో రేవంత్‌సర్కార్ వరుస వెన్నుపోట్లు పొడుస్తుందని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం సత్తుపల్లి పట్టణంలో మహనీయుల విగ్రహాల వద్ద బాపూజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకరరావు, కాల్నేని వెంకటేశ్వరరావు, చాంద్‌పాషా, మల్లూరు అంకంరాజు, పర్వతనేని వేణు, పెద్దిరెడ్డి పురుషోత్తం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.